## భూ సమస్యల పరిష్కార వేదిక 'భూ భారతి'

- అవగాహన సదస్సులో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అర్వపల్లిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి/తుంగతుర్తి, ఏప్రిల్ 24: రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి చట్టంపై అర్వపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో, తుంగతుర్తిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు పాల్గొని మాట్లాడారు. సాదాబైనామాలతో గతంలో భూములను కొనుగోలు చేసిన రైతుల సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ వేణుమాధవరావు, తాసీల్దార్లు జస్వంత్ శ్రీనివాసులు, దయానందం, ఎంపీడీఓ గోపి, శేషుకుమార్, ఏఓ గణేశ్, ఆర్వి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వైద్యాధికారి నగేశ్‌నాయక్, తుంగతుర్తి వ్యవసాయ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

- ఏఎస్పీ నాగేశ్వరరావు



కొత్తగూడెం గ్రామంలో ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

తుంగతుర్తి, ఏప్రిల్ 24: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉండడానికే ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా చట్టాలు, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, బెట్టింగ్, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆడప నరసింహారావు, సబ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్లేపల్లి ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

నేరేడుచర్ల, ఏప్రిల్ 24: మండలంలోని చిల్లేపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కోటాచలం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 0-5 సంవత్సరాల మధ్య పిల్లలకు పూర్తి స్థాయిలో టీకాలు వేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఎన్ఎం మమత, ఆశ వర్కర్ స్వర్ణలత, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల తనిఖీలు



రెస్టారెంట్‌లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 24: సూర్యాపేట పట్టణంలోని పలు రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలను మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. నిల్వ చేసిన పదార్థాలను వినియోగిస్తున్నందున జరిమానాలు విధించినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని డి.మార్ట్ సమీపంలో ఉన్న కావేరి రెస్టారెంట్‌లో పచ్చి చికెన్‌ను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటిరోజున ఉపయోగిస్తున్నందున రూ.5 వేలు, రెస్టారెంట్ పక్కనే ఉన్న దిల్‌కుష్ బేకరీ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో రూ.500, రాఘవప్లాజా సమీపంలోని గాయత్రి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, స్పైసీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిల్వ ఉంచిన పదార్థాలను, కుళ్లిన కోడిగుడ్లను వినియోగిస్తున్నందున రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేశ్, సిబ్బంది బాషుమియా, యాదగిరి, పుల్లయ్య పాల్గొన్నారు.

## 'గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి'



కొమ్మాల పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రత్యేకాధికారి

అర్వపల్లి, ఏప్రిల్ 24: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కొమ్మాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి మాలోతు బిచ్చు నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, వీబీకే యాదమ్మ, ఆశ కార్యకర్త కవిత, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## అనుమానితులపై సమాచారం ఇవ్వాలి : ఎస్ఐ

పాలకవీడు, ఏప్రిల్ 24: గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ ప్రజలను కోరారు. పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో దొంగల సమస్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లను, స్టార్టర్లను, విద్యుత్ తీగలను ఇండ్లకు తెచ్చుకోవాలని సూచించారు. దేవాలయాల్లో హుండీల్లో డబ్బులు ఉంచొద్దని, విలువైన ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులు భద్రపరచాలని కోరారు. వేసవి సెలవుల్లో ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని, తమ విలువైన వస్తువులను తగిన జాగ్రత్తలతో భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

## భూ భారతి చట్టంపై 26న అవగాహన సదస్సు

పాలకవీడు, ఏప్రిల్ 24: భూ భారతి చట్టంపై ఈ నెల 26వ తేదీన మండలంలోని గుడుగుంట్లపాలెం రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తాసీల్దార్ కమలాకర్ గురువారం విలేకరులకు తెలిపారు. సదస్సుకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఇతర అధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మజ్జిగ పంపిణీ అభినందనీయం : తాసీల్దార్

కోదాడ టౌన్, ఏప్రిల్ 24: కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైటెక్ చలివేంద్రం వద్ద దాతలు పందిరి సత్యనారాయణ, షర్మిల సహకారంతో పాదచారులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కోదాడ తాసీల్దార్ వాజీద్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గరినే శ్రీధర్, చారుగండ్ల రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, యాద సుధాకర్, గుడుగుంట్ల సాయి, వెంకటరమణ, సుధాకర్, శ్రీనివాసరావు, హైమావతి, రంగారావు, సురేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 24: జూన్ 6వ తేదీన నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద పేర్కొన్నారు. జిల్లా న్యాయస్థానంలోని కోర్టు హాల్‌లో న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. జూన్ 6న చెక్కు కేసులు, ప్రామిసరీ నోట్ కేసుల కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట ప్రధాన న్యాయమూర్తి రజిత గోపు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.అపూర్వ రవళి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.లింగయ్య, ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు జి.మధు తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్: ఇటీవల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీశారదను ఎస్పీ కె.నరసింహ కోర్టు సముదాయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో నేరాల నమోదు, దర్యాప్తు, కేసుల ట్రయల్స్, లోక్ అదాలత్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- గ్రామాల్లో ఆ పార్టీ నాయకుల ప్రచారం



కోదాడ రూరల్: కాపుగల్లు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెకు రంగులు అద్దుతున్న మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 24: వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్, కోటపహాడ్, ఏనుబాముల గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూడి నర్సింహారావు ఆధ్వర్యంలో ఇస్తాళాపురం, పాతర్లపహాడ్, బోరింగ్‌తండా, కొత్త తండా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సింగిల్ విండో మాజీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, గొట్టిముక్కల నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గంపల సుందర్, వీరారెడ్డి, నాయకుడు కానుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సభకు తరలిరావాలి

అర్వపల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ కోరారు. మండల పరిధిలోని కోమటిపల్లి, అడివెంల, కొమ్మాల, నాణ్య తండా గ్రామాల్లో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తాడూరి రామకోటి, చిర్రబోయిన వెంకన్న, నున్న యాదగిరి, సుందర్‌నాయక్, గడ్డం వెంకన్న, నాగు, మల్లేశ్, తిరుమల్, ప్రవీణ్, మల్సూర్, కృష్ణ, ఉపేందర్, సాయిబాబు, సైదులు, మల్లయ్య, భిక్షం, వెంకటయ్య, వెంకన్న, వంశీ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రామాపురంలో సన్నాహక సమావేశం

మేళ్లచెర్వు: బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సూరిశెట్టి బసవయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కొట్టె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### గులాబీ శ్రేణులు స్వచ్ఛందంగా కదిలి రావాలి

పాలకవీడు: రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు స్వచ్ఛందంగా కదిలి రావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ సభతో కనువిప్పు కలిగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు భూక్యా రవినాయక్, యరెడ్ల సత్యనారాయణరెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, పసుపులేటి సైదులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: రజతోత్సవ సభకు ఊరూరా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని కాపుగల్లులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకుముందు గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెకు రంగులు వేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొంతగాని అప్పారావు, శెట్టి సురేశ్‌నాయుడు, బెల్లంకొండ బ్రహ్మం, అన్నెం అంజిరెడ్డి, అన్నెం వెంకట్‌రెడ్డి, జమ్ములమడి నారాయణరావు, గంటా శ్రీనివాసయాదవ్, ఓర్సు గోపి, జిల్లా బోసుబాబు, సైదులు, జయరాజ్, ఉదయ్ పాల్గొన్నారు.



ఆత్మకూర్.ఎస్: ఇస్తాళాపురం గ్రామంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు



అర్వపల్లి: అడివెంలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్

## యువత క్రీడల్లో రాణించాలి

- నాగారం మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల



క్రీడా పరికరాలు అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల

నాగారం, ఏప్రిల్ 24: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల ఆకాంక్షించారు. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రానికి చెందిన యువ క్రీడాకారులకు గురువారం క్రికెట్ కిట్, వాలీబాల్ నెట్, బ్యాడ్మింటన్ కిట్‌ను ఆమె అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎలుక సైదులు, చిప్పలపల్లి చిరంజీవి, కన్నెబోయిన బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విరాళం



విరాళం అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులుసు యాదగిరిగౌడ్

తుంగతుర్తి, ఏప్రిల్ 24: మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమా మహేశ్వరుడి ఆలయం నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులుసు యాదగిరిగౌడ్ చేతులమీదుగా గురువారం ఆలయ నిర్మాణ కమిటీకి విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, గౌడ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 'హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమించాలి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హమాలీలు, ఇఫ్టూ నాయకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 24: కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలను చేపట్టాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామళ్ల నవీన్, గంట నాగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ పాలన సాగడం లేదని, అంతా ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో కార్పొరేట్ల పాలన సాగుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, నాగెల్లి రామనర్సయ్య, మూరగుండ్ల మధు, హమాలీ యూనియన్ నాయకులు పురుషోత్తం, చంద్రశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

## 'ధాన్యం కొనుగోళ్లు జరుగక రైతులకు తిప్పలు'

తిరుమలగిరి, ఏప్రిల్ 24: కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఎం నాయకుడు కడెం లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పలు సంఘాల నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నారు తప్పా ఎక్కడా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా వివిధ రకాల ఖర్చుల పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కడారి లింగయ్య, వ్యవసాయ సంఘం మండల నాయకులు మిట్టపల్లి లక్ష్మి, చిత్తలూరి సోమయ్య, దూపటి రాములు, శ్రీను, రమేశ్, లాలు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తులో బ్యాంక్ అధికారులు సహకరించాలి

- ఎస్పీ నరసింహ





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 24: కేసుల దర్యాప్తులో పోలీస్ ఇన్వెస్టిగేషన్ అధికారులకు అవసరమైన వివరాలు అందించడంలో బ్యాంక్ అధికారులు వేగంగా స్పందించాలని ఎస్పీ కె.నరసింహ కోరారు. సైబర్ నేరాల నివారణ, సైబర్ నేరాల కేసుల దర్యాప్తునకు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి జిల్లాలోని 23 బ్యాంక్ సంస్థల కంట్రోలర్లు, రీజినల్ మేనేజర్లు, ఆర్‌బీఐ కౌన్సిలర్లతో గురువారం ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ, ఏటీఎంల నిర్వహణ, బ్యాంకులకు నగదు తరలింపు, అనుమానాస్పద నగదు బదిలీ తదితర అంశాలపై తగిన సూచనలు చేశారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసాల నివారణకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడంలో పోలీసులతో కలిసి బ్యాంకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. శిక్షణ పొందిన వారిని బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్స్‌గా నియమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అర్వపల్లి, ఏప్రిల్ 24: మండల పరిధిలోని రామన్నగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.రాంబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రయ్య అనే రైతుకి చెందిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తాలు లేకుండా తూర్పారా పట్టిన ధాన్యం తీసుకురావాలని కోరారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని సూచించారు. తేమ శాతం 17 వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటా వేసి వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## ప్రజల్లో చైతన్యం నింపేందుకు ప్రజా భరోసా : డీఎస్పీ





మాట్లాడుతున్న డీఎస్పీ మట్టయ్య

పెన్‌పహాడ్, ఏప్రిల్ 24: ప్రజల్లో చైతన్యాన్ని నింపేందుకే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, రూరల్ సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు అదుపులో ఉంటే అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. గ్రామ వాతావరణం పిల్లలు, యువత భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందని తెలిపారు. సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఒక్కసారి నమోదైతే పేరు ఎప్పటికీ అలాగే నిలిచిపోతుందని వివరించారు. గ్రామంలో ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేయొద్దని, పీడీఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం నిర్వహించొద్దని సూచించారు. పేకాట, బెట్టింగ్, బహిరంగంగా మద్యం తాగడం వంటి చర్యలకు పాల్పడే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కస్తాల గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కోదాడ టౌన్, ఏప్రిల్ 24: హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కోదాడ పట్టణ పరిధిలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. బీఏ ఫస్టియర్ విద్యార్థినులు కె.విజయ 52వ కేటగిరీలో 130 కేజీలు, ఎ. లక్ష్మీప్రసన్న 49వ కేటగిరీలో 120 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో మొదటి స్థానం సాధించి రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారు. పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హడసరాణి, అధ్యాపక బృందం గురువారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చందా అప్పారావు, అధ్యాపకులు డాక్టర్ బి.సైదిరెడ్డి, జి.సైదులు, ఎస్ఎం.రఫీ, టి.రాజు, కేలోతు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

నేరేడుచర్ల, ఏప్రిల్ 24: రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. మండలంలో మొత్తం 1,353 దరఖాస్తులు రాగా వాటిలో ఎస్టీ- 93, ఎస్సీ- 518, బీసీ- 668, ఈబీసీ- 39, క్రిస్టియన్ మైనార్టీలు- 4, ముస్లిం మైనార్టీలు -31 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు నివేదికను తయారు చేస్తున్నారు. అనంతరం ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

## హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

హుజూర్‌నగర్, ఏప్రిల్ 24: హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా దేశ్‌ముఖ్ రాధిక గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ అధికారి శ్రీధర్, వైస్ చైర్‌పర్సన్ ఆదురి స్రవంతి, సభ్యులు నాగుల్‌మీరా, సైదిరెడ్డి, శ్రీనివాసరావు, వెంకన్న, నాగేశ్వరరావు, కొండారెడ్డి, జానకిరాములు, కోటయ్య, వెంకటరెడ్డి, రాయ్‌పాల్ పాల్గొన్నారు.

# ఉగ్రదాడికి నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



సూర్యాపేటలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



కోదాడ టౌన్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 24: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యలకు నిరసనగా సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట ఉన్న కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. సూర్యాపేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంటూరు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్ న్యాయవాదులు నాయిని రాంమనోహర్‌రావు, వెంకట బుచ్చేశ్వర్‌రావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

### కోదాడలో..

కోదాడ టౌన్: జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, జాయింట్ సెక్రటరీ నయీమ్, కోశాధికారి వెంకటేశ్వరరావు, బండారు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ/కోదాడ రూరల్: కోదాడలో ప్రజా చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాయపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఎంఈఓ సలీంషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నేరుడుచర్లలో వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పించారు.

గరిడేపల్లి: మండల కేంద్రం గరిడేపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.